క్లుప్తంగా

పాండురంగ స్వామి ధ్వజ స్తంభ ప్రతిష్ట

యాడికి: మండల కేంద్రంలో నంబర్-1 స్కూల్ సమీపంలో ఉన్న పాండురంగ స్వామి ధ్వజ స్తంభ ప్రతిష్ఠాపన శనివారం ఘనంగా నిర్వహించారు. దాతలు, గ్రామస్తుల సహకారంతో కార్యక్రమం చేపట్టారు. ఉదయం ప్రాత:కాల పూజ, దీక్షా హోమం, ప్రత్యేక హోమాలు, పూజల అనంతరం ధ్వజస్తంభం ప్రతిష్ట శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమాన్ని తిలకించేందుకు అధిక సంఖ్యలో భక్తులకు హాజరయ్యారు. భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు అన్నదానం ఏర్పాటు చేశారు.

జగనన్న ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి


లబ్ధిదారులతో మాట్లాడుతున్న కమిషనర్ జబ్బార్‌మియా, హౌసింగ్ డీఈ సుబ్బరాయుడు

తాడిపత్రి టౌన్ : మున్సిపాలిటీ జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలను త్వరిగతిన పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ జబ్బార్ మియా, హౌసింగ్ డీఈ సుబ్బరాయుడు లబ్ధిదారులను కోరారు. హౌసింగ్ డేను పురస్కరించుకుని శనివారం రూరల్ పరిధిలోని సజ్జలదిన్నె లేఔట్ 1, 2, జరుగుతున్న ఇళ్ల నిర్మాణాలను వారు పరిశీలించారు. అనంతరం లబ్ధిదారులతో ఇళ్ల నిర్మాణాలపై చర్చించారు. ప్రభుత్వం ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారులకు బిల్లులు మంజూరు చేస్తోందన్నారు. అనంతరం పుట్లూరు రోడ్డులోని టిట్కో ఇళ్ల నిర్మాణాలను వారు పరిశీలించారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ సంధ్య, వార్డు సచివాలయ కార్యదర్శులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

పుట్లూరు: విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే శాఖ పరమైన చర్యలు తప్పవని ఎంపీడీఓ యోగానందరెడ్డి అన్నారు. శనివారం ఆయన ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శులతో పాటు సచివాలయ సిబ్బంది ప్రతి రోజూ 10 గంటల లోపు బయోమెట్రిక్ హాజరు తప్పక వేయాలన్నారు. యూనిఫాం, ఐడీ కార్డును ధరించాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శులు ఈ నెల 9 లోపు మిషన్ అంత్యోదయ సర్వే ఫారాలను సిద్ధం చేయాలని సూచించారు. సమావేశంలో ఈఓఆర్డీ అనంద్‌ప్రసాద్ పాల్గొన్నారు.

కార్మిక హక్కులను కాలరాస్తే సహించం

గుంతకల్లుటౌన్: కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను కాలరాస్తున్న మోదీ సర్కారుపై కలిసికట్టుగా పోరాడాలని భారత కార్మిక సంఘాల సమాఖ్య(ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్వర్లు, ఓపీడీఆర్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం ఐఎఫ్‌టీయూ జిల్లా మహాసభలు పట్టణంలో జరిగాయి. ఐఎఫ్‌టీయూ కార్యాలయం నుంచిబీరప్పగుడి సర్కిల్‌లోని గుంతకల్లప్ప స్వామి ఫంక్షన్ హాల్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు బి.సురేష్ అధ్యక్షతన జరిగిన సభనుద్దేశించి వారు మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం కార్మికుల హక్కులపై ఉక్కుపాదం మోపుతోందని మండిపడ్డారు. మానవహక్కుల వేదిక తెలుగురాష్ట్రాల సమన్వయకమిటీ సభ్యుడు చంద్రశేఖర్, సీపీఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ పార్టీ జిల్లా కార్యదర్శి ఇండ్ల ప్రభాకర్ రెడ్డి,పౌరప్రగతి శీల వేదిక జిల్లా కార్యదర్శి డి.తారకేష్, న్యూడెమోక్రసీ పార్టీ డివిజన్ కార్యదర్శి బి.సురేష్, పట్టణ కార్యదర్శి జి.చిన్నా, తదితరులు పాల్గొన్నారు.

పేద కుటుంబానికి సాయం


పెండ్లి వస్తువులు అందిస్తున్న ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు

శింగనమల: మండలంలోని పెరవలికి చెందిన నారాయణస్వామికి ముగ్గురు కుమార్తెలున్నారు. పెద్ద కూతురు రజనీ పెళ్లికి ఇబ్బందులు పడుతున్నట్లు తెలుసుకున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి తల్లి జొన్నలగడ్డ నిర్మలాదేవి శనివారం గ్రామానికి చేరుకుని పెళ్లి కుమార్తెకు కానుకతోపాటు పెళ్లి సరుకులు అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు పవిత్ర, వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం మండల అధ్యక్షురాలు శంకుతలమ్మ, ఉల్లికల్లు చెన్నమ్మ పాల్గొన్నారు.

ఘనంగా గ్రామోత్సవం

పెద్దవడుగూరు : ఏ.తిమ్మాపురంలో శనివారం సాయంత్రం శివమాలధారులు గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శివుని ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రంలో గ్రామంలోని ప్రధాన వీధుల్లో శివుని ప్రతిమతో ఊరేగింపు చేపట్టారు. గ్రామంలోని చిన్నారులు దీపాలతో పాల్గొన్నారు.

నేడు కొండమీదరాయుని రథోత్సవం

- ఏర్పాట్లు పూర్తి చేసిన ఆలయ కమిటీ సభ్యులు
- తెల్లవారుజామున స్వామి కల్యాణోత్సవం

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలో కొండమీదరాయుని బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా శనివారం ఐరావతంపై స్వామి వారు ఊరేగారు. ఆదివారం జరిగే కొండమీదరాయుని రథోత్సవానికి ఆలయ కమిటీ, అధికారులు ఏర్పాట్లు చేశారు. మండల కేంద్రంలోని లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో తెల్లవారు జామున 4 గంటలకు కొండమీదరాయుని కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నారు. అదే విధంగా 11 గంటలకు శ్రీవారిని సతీ సమేతంగా సూర్య ప్రభ వాహనంపై మండల కేంద్రంలోని పుర వీధుల్లో ఊరేగించనున్నారు. అనంతరం రథోత్సవాన్ని సాగనుంది. ఆలయ కమిటీ భక్తులకు అసౌకర్యాలు కలగకుండా అన్ని చర్యలు చేపట్టారు. దేవర కొండపై కూడా ప్రత్యేక పూజల నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. అయితే ఆలయ కమిటీ వారే కొండ మీదకు వెళ్లేందుకు ప్రత్యేక వాహనాలు ఏర్పాటు చేశారు. భక్తులకు తహసీల్దార్ కార్యాలయం ఎదుట, మార్కండేయస్వామి దేవాలయం ఎదుట అన్నదానం నిర్వహించనున్నారు.



బుక్కరాయసముద్రం: రథోత్సవానికి తేరుబండి ముస్తాబు, గార్లదిన్నె: సుబ్రహ్మణ్యేశ్వర రథోత్సవం

రథోత్సవాలకు పటిష్ట బందోబస్తు

అనంతపురం శ్రీకంఠం సర్కిల్: జిల్లాలో ఆదివారం జరుగనున్న రథోత్సవాలు, తిరునాళ్లకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ డాక్టర్ ఫక్కీరప్ప కాగినెల్లి తెలిపారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ మాఘమాసం మూడో ఆదివారం కావడంతో అశ్వత్థం నారాయణస్వామి, తడకలేరు అశ్వత్థం నారాయణ స్వామి తిరునాళ్లతో పాటు కోటంక సుబ్రహ్మణ్య స్వామి, బుక్కరాయసముద్రం కొండమీదరాయుడు, తొండపాడు బొలికొండ రంగనాథ స్వామి, వెలిగొండ భగళాంబిక అమ్మవారి రథోత్సవాలు జరుగుతున్నాయన్నారు. జిల్లా నుంచే కాకుండా ఇతర రాష్ట్రాలు, ప్రాంతాల నుంచి భక్తులు అధికంగా తరలి వచ్చే అవకాశం ఉందన్నారు. భక్తుల తాకిడికి అనుగుణంగానే చర్యలు తీసుకోవాలన్నారు. నదీ స్నానాల సందర్భంగా భక్తులు జాగ్రత్తలు పాటించాలన్నారు.

వైభవంగా సుబ్రహ్మణ్యేశ్వరస్వామి రథోత్సవం

గార్లదిన్నె: కోటంక గ్రామ సమీపంలోని కొండల్లో వెలసిన గుంటికింద సుబ్రహ్మణ్యేశ్వరస్వామి రథోత్సవం శనివారం రాత్రి వైభవంగా జరిగాయి. ముందుగా స్వామికి ఏకవార రుద్రాభిషేకం, సహస్రనామార్చనను ప్రధాన అర్చకుడు రామాచార్యులు నిర్వహించారు. స్వామి వారికి నివాస గ్రామమైన కోటంకలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వెండి విగ్రహాలను విద్యుద్దీపాలతో పుష్పాలతో అలంకరించిన రథంలో ఉంచి రథోత్సవం ప్రారంభించారు. ఈసందర్భంగా భక్తులు కీర్తనలు, మేళతాళాలతో రథాన్ని స్వామి సన్నిధికి చేర్చారు.

ఆలయ మాస్టర్ ప్లాన్ అమలుపై సమావేశం

గుంతకల్లు రూరల్: కసాపురం నెట్టికంటి ఆంజనేయ స్వామి దేవస్థానంలో మాస్టర్ ప్లాన్ అమలుపై శనివారం ఆలయ అధికారులతో ద్రోణ కన్సల్టెన్సీ సిబ్బంది సమావేశం నిర్వహించారు. నెట్టికంటి ఆంజనేయస్వామిని దర్శించుకునే భక్తుల సంఖ్య రోజు రోజుకూ పెరుగుతూ ఉండటం, భక్తుల సంఖ్యకు సరిపడా ఆలయంలో వసతులు కరువవడంతో ఆలయ అభివృద్ధిలో భాగంగా అధికారులు 25 ఏళ్ల క్రితం మాస్టర్‌ప్లాన్ రూపొందించి దేవదాయశాఖ అనుమతి కోసం ప్రతిపాదనలు పంపారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి ఆలయ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారు. దేవదాయశాఖ కమిషనర్, మంత్రితోపాటు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో మాస్టర్ ప్లాన్ అమలుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఈ సందర్భంగా కన్సల్టెన్సీ సిబ్బంది ఆలయ ఈఓ డీ.వెంకటేశ్వరరెడ్డి, ఏఈఓ ధనుంజయ, ధర్మకర్త సుగుణమ్మ, ఆలయ ప్రధాన అర్చకుడు గరుడా చార్యులుతో దాదాపు రెండు గంటల పాటు చర్చించారు. అధికారులు మరిన్ని మార్పులు చెప్పడంతో ఆ ప్రకారం మరో ప్లాన్ సిద్ధం చేస్తామని కన్సల్టెన్సీ సిబ్బంది తెలియజేశారు.


మాస్టర్ ప్లాన్ అంశాలను వివరిస్తున్న అధికారులు, ద్రోణ కన్సల్టెన్సీ సిబ్బంది

రంగనాథస్వామి ఆలయ అభివృద్ధికి కృషి

గుత్తి రూరల్: తొండపాడులోని మాణిక్య రంగనాథ స్వామి ఆలయ అభివృద్ధితో పాటుగా కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. శనివారం గ్రామంలోని రంగ కల్యాణ మండపంలో కమిటీ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ధర్మకర్త మాకం శ్రీకాంత్, అధ్యక్షుడు జీవీ.రామన్ మాట్లాడుతూ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అనేక అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామన్నారు. రూ.85 లక్షలతో బొలికొండ పైన ఉన్న లక్ష్మమ్మ గుడి వరకూ మెట్ల మార్గం, సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టామన్నారు. లక్ష్మమ్మ ఆలయం వద్ద 8 గదుల ఆధునీకరణ, భక్తులకు నూతన సత్రం నిర్మిస్తామన్నారు. లక్ష్మమ్మ ఆలయాన్ని ఆగమ శాస్త్రం ప్రకారం అభివృద్ధి చేస్తామన్నారు. బొలికొండపై రహదారికి ఇరువైపులా డ్రైనేజీలను నిర్మిస్తున్నామన్నారు. అభివృద్ధి పనులు దాదాపు 80 శాతం పూర్తయ్యాయని త్వరలోనే అన్ని పూర్తి చేస్తామన్నారు. రంగనాథ స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా కమిటీ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు అన్నదానంతో పాటుగా తాగునీటి వసతి ఏర్పాటు చేశామన్నారు. కమిటీ ఉపాధ్యక్షులు బాలమోహన్, కృష్ణ రంగయ్య, ప్రధాన కార్యదర్శి అశ్వర్థ రంగయ్య, కోశాధికారి వెంకటరంగయ్య, సంయుక్త కార్యదర్శులు నాగరాజయ్య, రామరంగయ్య పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కమిటీ సభ్యులు

విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలి

గార్లదిన్నె: ప్రభుత్వ పాఠశాలలు విద్యార్థులు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు రోజూ పౌష్టికాహారం అందించాలని అసిస్టెంట్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం కమలాపురం గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేశారు. సచివాలయంలో రికార్డులు పరిశీలించి, ప్రజలకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. అనంతరం ఏఎన్‌ఎంలు, డిజిటల్ అసిస్టెంట్లు, పాఠశాల హెచ్‌ఎం, అంగన్‌వాడీ సిబ్బందితో మాట్లాడారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాల్లో భాగంగా ప్రభుత్వ, అంగన్‌వాడీ పాఠశాలల్లో విద్యార్థులు డ్రాపౌట్స్ కాకుండా చూడాలన్నారు. ప్రతి నెలా విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి, పౌష్టికాహారం లోపాన్ని సరి చేయాలన్నారు. రక్తహీనత ఉన్న విద్యార్థులకు ఆహారంతో పాటు వైద్య సేవలు అందించాలన్నారు. ఈఓఆర్డీ వెంకటలక్ష్మి ఉన్నారు.


సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న అసిస్టెంట్ కలెక్టర్ ప్రశాంత్ కుమార్

క్రీడా పోటీల్లో మోడల్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

గార్లదిన్నె: స్థానిక మోడల్ స్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్, బాక్సింగ్ పోటీల్లో రాణించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ సతీష్ పేర్కొన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ జనవరి 31, ఈనెల 1,2,3 తేదీల్లో తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రి ఎస్‌కేవీటీ స్కూల్లో రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్, బాక్సింగ్ పోటీలు నిర్వహించారు. ఇందులో అండర్-19 70 కేజీల విభాగంలో దివ్యనందీశ్వరి బంగారు పతకం సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపి కైందన్నారు. అండర్-19 60 కేజీల విభాగంలో మంజునాథ రజతం, లక్ష్మి అనే బాలిక 45 కేజీల విభాగంలో కాంస్య పతకం, అండర్-14 44 కేజీల విభాగంలో బన్నీ రజతం,అండర్-17 70 కేజీల విభాగంలో విజయ సింహారెడ్డి రజతం, 80 కేజీల విభాగంలో నరేష్, 66 కేజీల విభాగంలో నందీష్ గౌడ్ కాంస్య పతకం సాధించి మూడో స్థానంలో నిలిచారన్నారు. ఉపాధ్యాయులు, పీఈటీ వెంకటేష్ గెలుపొందిన విద్యార్థులను అభినందించారు.

కిశోర బాలికల వ్యక్తిగత పరిశుభ్రతపై సర్వే

గుత్తి రూరల్: కిశోర బాలికలు బహిష్టు సమయంలో వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని భారత ప్రభుత్వ ఆరోగ్య మంత్రిత్వ శాఖ వైద్యాధికారి రమణ, ఫెలో శ్రీనివాస్ సూచించారు. కిశోర బాలికల వ్యక్తిగత శుభ్రతపై శనివారం మండలంలోని తొండపాడు, ఊటకల్లు, బేతాపల్లి గ్రామాల్లో సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి రమణ మాట్లాడుతూ 13 నుంచి 19 ఏళ్లున్న కౌమార బాలికలు నెలసరి రుతక్రమ సమయంలో వ్యక్తిగత పరిశుభ్రత పాటించడంపై సర్వే నిర్వహించామన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో కేంద్రం గుర్తించిన అత్యంత కరువు ప్రాంతమైన గుంతకల్లు నియోజకవర్గంలోని గుత్తి, గుంతకల్లు మండలాల్లో 120 మందిని గుర్తించి సర్వే చేశామన్నారు. మూడు రోజులుగా రెండు మండలాల్లోని గ్రామాల్లోని బాలికలను శాస్త్రీయ పద్ధతుల్లో రుతు సమయంలో పాటించాల్సిన వ్యక్తిగత పరిశుభ్రతపై వివరాలు సేకరించామన్నారు. బహిష్టు సమయంలో వారికి అందుతున్న వైద్య సేవలు, ప్రభుత్వం ద్వారా వారికి అందిస్తున్న శానిటరీ న్యాప్కిన్స్ తదితర వాటిని విచారించామన్నారు. అనేక అంశాలతో కూడిన ప్రశ్నావళితో మహిళా ఇన్వెస్టిగేటర్ల ద్వారా విచారించామని, నివేదికను కేంద్ర ప్రభుత్వానికి పంపుతామని వైద్యాధికారి రమణ తెలిపారు. డీఎంహెచ్‌ఓ విరబ్బాయి, జిల్లా రాష్ట్రీయ బాల స్వాస్తిక అధికారి నారాయణ స్వామి, వైద్యాధికారులు సందీప్‌యాదవ్, దేవేంద్రనాయక్, సూపర్‌వైజర్లు లాజరస్, వెంకటరమణమ్మ, లక్ష్మి, ఏఎన్‌ఎం కాంత, ఆశా కార్యకర్త రామలక్ష్మి పాల్గొన్నారు.

'అప్పర్ భద్ర' నిలుపుదల చేయాలి : సీపీఐ

గుంతకల్లు : రాయలసీమ జిల్లాలకు ప్రమాదకారిగా మారిన అప్పర్ భద్ర ప్రాజెక్ట్ పనులు తక్షణమే నిలిపి వేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు డి.జగదీష్ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కర్ణాటకలో అప్పర్ భద్ర ప్రాజెక్ట్ నిర్మాణానికి ఆగమేఘాలపై అనుమతులు మంజూరు చేయడంతో పాటు జాతీయ హోదా కల్పిస్తూ నిధులు మంజూరు చేయడాన్ని ఆయన తప్పుబట్టారు. ఈ ప్రాజెక్టు పనులు పూర్తయితే రాయలసీమ జిల్లాలకు తుంగభద్ర నీరు అందుకుండా పోయే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కేంద్రప్రభుత్వం వెంటనే ఈ ప్రాజెక్టును నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి బి.మహేష్, పట్టణ కార్యదర్శి గోపీనాథ్ పాల్గొన్నారు.

నేడు రంగనాథుడి రథోత్సవం

గుత్తి రూరల్: తొండపాడు బొలికొండ రంగనాథస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం గజవాహనంపై దేవేరులతో కలసి రంగనాథ స్వామి భక్తులకు దర్శనమిచ్చారు. శనివారం వేకువజామున స్వామి కల్యాణోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. కాగా ఆదివారం ఉదయం బ్రహ్మరథోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ దేవదాసు తెలిపారు.

సంక్షిప్త సమాచారం


మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

గుంతకల్లు రూరల్: మహోన్నత భవిష్యత్తు కలిగిన విద్యార్థుల జీవితాలను నాశనం చేస్తున్న మాదకద్రవ్యాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని ప్రిన్సిపాల్ గోపాల్, కసాపురం ఎస్ఐ గోపాలుడు సూచించారు. శనివారం స్థానిక శంకరానందగిరీ డిగ్రీ కళాశాలలో పోలీస్ శాఖ, జాతీయ సేవాపథకం సంయుక్త ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఇన్‌చార్జ్ ఎస్ఐగా గురుప్రసాద్ రెడ్డి

యాడికి: మండల ఇన్‌చార్జ్ ఎస్ఐగా గురుప్రసాద్ రెడ్డి శనివారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మండలంలో పేకాట, మట్కా , గుట్కా, అసాంఘిక కార్యకలాపాలు వంటి వాటిని ఉపేక్షించేది లేదన్నారు. గ్రామాల్లో ప్రజలు ఏమైనా సమస్యలు సృష్టిస్తే అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

కారు ఢీకొని మహిళ మృతి


కళ్యాణి (ఫైల్)

పెనుకొండ రూరల్: జాతీయ రహదారిపై వేగంగా దూసుకొచ్చిన కారు (స్కార్పియో) ఢీకొన్న ఘటనలో ఓ మహిళ మృతి చెందింది. అనంతపురం జిల్లా తాడిపత్రికి చెందిన అలవల కళ్యాణి (65), మురళీకృష్ణ దంపతులు శుక్రవారం రాత్రి ఆర్టీసీ బస్సులో బెంగళూరుకు బయలుదేరారు. అర్ధరాత్రి సమయంలో గుట్టూరు వద్దకు చేరుకోగానే డ్రైవర్ బస్సును ఆపి టీ తాగేందుకు సమీపంలోని హోటల్ వద్దకు వెళ్లాడు. ఆ సమయంలో నిద్ర లేచిన కళ్యాణి మూత్ర విసర్జనకు వెళ్లే క్రమంలో జాతీయ రహదారి దాటుతుండగా బెంగళూరు నుంచి అనంతపురం వైపుగా వెళుతున్న స్కార్పియో వాహనం ఢీకొంది. ఘటనలో తీవ్రంగా గాయపడిన కళ్యాణిని 108 అంబులెన్స్ ద్వారా పెనుకొండలోని ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆమె మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై పెనుకొండ పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

యువకుడి మృతి

పామిడి: రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు కర్నూలు ప్రభుత్వాస్పత్రిలో మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. రామగిరి వాసి వడ్డే సురేష్(25) శనివారం రాత్రి బైక్‌పై వెళ్తుండగా పులికనుమ వద్ద పాలవ్యాన్ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. అతడిని కుటుంబ సభ్యులు కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో శనివారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతుడికి భార్య రాజేశ్వరి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పామిడి పోలీసులు కేసు నమోదు చేశారు.

వృద్ధుడికి తీవ్ర గాయాలు

గుత్తి: పట్టణంలోని తాడిపత్రి రోడ్డులో నడుచుకుంటూ వెళుతున్న ఓ వృద్ధుడిని బైక్ ఢీ కొనడంతో తీవ్రగాయాలపాలయ్యాడు. వివరాలు.. పెద్దవడుగూరు మండలం కొట్టాలపల్లికి చెందిన పుల్లారెడ్డి గుత్తి నుంచి తొండపాడుకు కాలినడకన బయలుదేరాడు. తాడిపత్రి రోడ్డులో వెనుక నుంచి వేగంగా వచ్చిన బైక్ ఢీకొంది. తీవ్రంగా గాయపడిన పుల్లారెడ్డిని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం అనంతపురం ప్రభుత్వాస్పత్రికి రెఫర్ చేశారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

మహిళకు తీవ్ర గాయాలు..

పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో శనివారం రోడ్డు దాటుతున్న లక్ష్మీదేవి అనే మహిళను బైక్‌ను ఢీ కొంది. ప్రమాదంలో ఆమె తీవ్రంగా గాయపడింది. స్థానికులు వెంటనే ఆమెను ఆటోలో గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

బుక్కరాయసముద్రం: చిక్కవడియార్ చెరువులో శనివారం గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్లు ఎస్ఐ శివప్రసాద్ తెలిపారు. మృతుడికి 35 నుంచి 40 సంవత్సరాలు వయస్సు ఉంటుందని, ఒంటిపై తెల్లటి గీతల చొక్కా, నల్లటి జీన్స్‌ప్యాంట్ ధరించాడున్నారు. మృతుని వివరాలు, ఆచూకీ తెలిస్తే 7013064687 కు సమాచారం ఇవ్వాలని కోరారు.

జాతీయ మహాసభలు జయప్రదం చేయండి

గుంతకల్లు: ఈ నెల 15 నుంచి 20 వరకు సీపీఐ(ఎంఎల్) ఆధ్వర్యంలో జరిగే జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వలి, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వేమన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ బిహార్‌లోని పాట్నాలో జరిగే మహాసభలకు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు.

టీ కేఫ్‌లో చోరీ

గుత్తి: పట్టణంలోని లచ్చానపల్లి రోడ్డులో ఉన్న బీకేఆర్ టీ కేఫ్‌లో చోరీ జరిగింది. గుర్తు తెలియని దొంగలు టీ కేఫ్‌లోకి ప్రవేశించి లోపల ఉన్న రూ. 20 వేలు నగదు, సిగరెట్ బండిళ్లు ఎత్తుకెళ్లారు. సంఘటనపై బాధితుడు బొలికొండారెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

దంపతులకు జైలుశిక్ష

యల్లనూరు: భూ వివాదంలో దాడికి పాల్పడిన దంపతులకు జైలు శిక్ష విధిస్తూ తాడిపత్రి న్యాయస్థానం జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించింది. ఎస్ఐ రామకృష్ణ తెలిపిన మేరకు... యల్లనూరు మండలం పెద్దమల్లేపల్లిలో భూమి విషయంగా 2015లో కె.సుబ్బరాయుడు, కె.రామకృష్ణ మధ్య ఘర్షణ చోటు చేసుకుంది.

ఆ సమయంలో సుబ్బరాయుడుపై దంపతులు రామకృష్ణ, పార్వతి దాడిచేశారు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు నిందితులను అప్పట్లో న్యాయస్థానంలో హాజరుపరిచారు. సాక్ష్యాధారాలతో నేరం రుజువు కావడంతో రామకృష్ణ, పార్వతి దంపతులకు ఆరు నెలల జైలు శిక్ష, రూ.10 వేల జరిమానా విధిస్తూ తాడిపత్రి న్యాయస్థానం శుక్రవారం తీర్పు వెలువరించింది.

మద్యం బాటిళ్ల పట్టివేత

తాడిపత్రి: తలారి చెరువు గ్రామానికి చెందిన శివనాథ్ అనేవ్యక్తి వద్ద 12 క్వార్టర్ బాటిళ్లు స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేసినట్లు రూరల్ ఎస్ఐ మహమ్మద్ గౌస్ శనివారం తెలిపారు. అక్రమంగా మద్యం బాటిళ్లను కలిగి ఉండడంతో పాటు వాటిని విక్రయిస్తున్న శివనాథ్‌పై కేసు నమోదు చేశామన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించండి

గుంతకల్లుటౌన్: ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు, గ్యారేజీ సిబ్బందికి రావాల్సిన ఓటీ అలవెన్సులు వెంటనే ఇవ్వాలని లేదా 8 గంటల డ్యూటీ విధానాన్ని అమలు చేయాలని ఎన్‌ఎంయూ డిపో అధ్యక్షుడు ఏఎల్ఎన్.గౌడ్, కార్యదర్శి నటరాజ్ కోరారు. శనివారం డిపో కార్యాలయ అధికారి మోహన్‌ను ఎన్‌ఎంయూ నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు.

ప్రభుత్వాసుపత్రికి వాటర్ ట్యాంక్ వితరణ


వాటర్ ట్యాంక్ అందిస్తున్న దృశ్యం

గుత్తి: మండలంలోని వన్నేదొడ్డి సర్పంచు బేడల లక్ష్మిదేవి, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా నాయకులు బేడల వెంకటరాముడు దంపతులు శనివారం గుత్తి ప్రభుత్వాసుపత్రికి సుమారు రూ.12 వేల విలువ చేసే సింటెక్స్ వాటర్ ట్యాంక్, పైప్‌లను వితరణగా ఇచ్చారు. ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎల్లప్ప వాటిని అందజేశారు. ఆసుపత్రి సిబ్బంది రాజేష్, ఆది, రమణ, అశోక్, తిరుమలేష్, చిట్టి, లింగమయ్య, వీరన్న పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

గుత్తి రూరల్: టి.కొత్తపల్లి శివారులో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలిలా ఉన్నాయి. గుంతకల్లు మండలం వైటీ.చెరువు గ్రామానికి చెందిన రంగస్వామి సమీప బంధువులు, స్నేహితులతో కలిసి తొండపాడు తిరునాలకు వచ్చాడు. స్వగ్రామానికి వెళ్తుండగా టి.కొత్తపల్లి గ్రామ శివారులో 67వ నంబర్ జాతీయ రహదారిపై వెనుక నుంచి ట్రాక్టర్ వేగంగా వచ్చి ఢీకొంది. ప్రమాదంలో రంగస్వామి కుడి చేయి తెగి, తలకు బలమైన గాయాలయ్యాయి. గమనించి బంధువులు, స్నేహితులు వెంటనే గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు కర్నూలు తీసుకెళ్లారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

క్రీడలపై దృష్టి పెట్టాలి

తాడిపత్రి టౌన్ : విద్యార్థులు చదువుతోపాటు క్రీడలపై దృష్టి పెట్టాలని డీఎస్పీ వీఎన్‌కే చైతన్య పేర్కొన్నారు. స్థానిక కాల్వగడ్డ వీధిలోని శ్రీ చైతన్య స్కూలులో శనివారం స్పోర్ట్స్ ఫెస్ట్‌ను డీఎస్పీ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు శారీరక, మానసిక, దృఢత్వం పెంపొందించడానికి ఎంతగానో తోడ్పడతాయన్నారు.